



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బిల్లుల మోత.. వినియోగదారులకు వాత



- సామాన్యులకు తప్పని కష్టాలు
- బెంబేలెత్తున్న విద్యుత్ వినియోగదారులు

ప్రజాశక్తి-రాయచోటి

తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత చాప కింద నీరులా ఆరు నెలల వ్యవధిలోనే సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచేశారు. నాడు వైసిపి ప్రభుత్వం మాదిరిగానే నేడు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుంది.

పేద, ధనిక అని తేడా లేకుండా విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచేశారు. చిన్న దుకాణాల నుంచి పెద్ద షాపింగ్ మాల్ వరకు అసలు కంటే కొసరు పెంచేసి పెద్ద బండ వేశారు. వినియోగించుకున్న యూనిట్ల కంటే వివిధ రకాల పేర్లతో విధించే బాదుడే ఎక్కువైంది. ఈనెలలో విద్యుత్ బిల్లు చూస్తే వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. ఎప్పుడో రెండు, మూడేళ్ల కిందట వాడుకున్న విద్యుత్‌కు ఆయా ఛార్జీల పేరుతో వసూలు చేస్తున్నారు. దీంతో సామాను ప్రజలు అల్లాడిపోతున్నారు. అన్నమయ్య జిల్లాలో 132 ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్యం (కమర్షియల్) దాదాపు 52,962 లక్షల మంది గృహలు, మొత్తం 5,07,988 మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం అదాని సంస్థతో చేతులు కలిపి వారిచ్చిన ముడుపులు తీసుకుని పేదల కడుపు కొట్టేందుకు సిద్ధమైంది. ఇదేమిటని పేదలు ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించడం గతంలో జరిగింది. అదాని రూ. 17,500 కోట్లు డబ్బులు ఇచ్చి 25 ఏళ్ల పాటు రాష్ట్రంలో కరెంటు ఉత్పత్తి వినియోగం, తదితర అంశాలకు కట్టుబడి ఉండాలని వై.ఎస్.జగన్మోహన్ రెడ్డికి ముడుపులిచ్చి మాట తీసుకున్నారు. అలా చేయడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై విద్యుత్ ఛార్జీల రూపంలో పెనుబారం పడింది. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడు విద్యుత్ బిల్లులపై బాదుడే బాదుడు అని చెప్పి తమ పార్టీ అధికారంలోకి వస్తే ఇలాంటి బాదుడు కార్యక్రమాలు లేకుండా పేదల పక్షాన ఉంటామని మాట ఇచ్చారు. కానీ మహా కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలోనే పెంచేశారు. పిక్సిడ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు ఎఫ్‌పిపిసిఎటు, ఇడిఐఎస్‌టి, సర్దుబాటు, రకాల పేర్లతో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచేశారు.



నవంబర్, డిసెంబర్ బిల్లుల్లో తేడా

సగం పైనే విద్యుత్ ఛార్జీలు పెరిగిపోయాయి

గతంలో వస్తున్నటువంటి విద్యుత్తు బిల్లుల కంటే నవంబర్ నెలలో సగం పైనే అదనపు విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో 1302 ప్రభుత్వ కార్యాలయం ఉండగా ఇప్పటివరకు 375 ప్రభుత్వ కార్యాలకు స్మార్ట్ మీటర్లును ఏర్పాటు చేశారు. త్వరలో దుకాణాలు, గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి విద్యుత్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. దీనికి ముందుగానే రీఛార్జ్ చేసుకుంటేనే లేదంటే విద్యుత్ కట్ అవుతుంది. దీంతో ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటాయో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సామాన్యులకు తప్పని కష్టాలు

ఇప్పటికే నిత్యావసర సరుకులు, కూరగాయలు, వంట నూనె, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారి పైన మాత్రం బిల్లులు కట్టకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తాం, కేసులు పెడదాం అంటూ బెదిరించి వారి చేత డబ్బులు కట్టించుకుంట ఎన్నారు. దీనికి తోడు కరెంటు బిల్లులు కూడా అధికంగా వస్తే తాము ఎలా బతకాలని వాపోతున్నారు. కూలీనాలు చేసుకుని బతికే వాళ్ళం తమపై ఇలా పన్నుల భారంతో నడ్డి విరిస్తే ఎలా జీవించాలి అంటు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ బిల్లులు శీతాకాలంలోనే ఇలా ఉంటే రాబోయే వేసవికాలంలో ఎలా ఉంటాయని సామాన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పేదలపై పడుతున్న పెనుభారం తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించలేకున్నాం



ప్రభుత్వాలు ఎన్ని మారినా కూడా ప్రతి ఏడాది విద్యుత్ బిల్లులు పెంచుకుంటూనే పోతున్నారు. గతంలో మాకు రూ .5 వందలు నుంచి రూ .6 వందల వరకు వచ్చేది. ఈ నెలలో ఏకంగా రూ .14 వందల వచ్చింది. దీంతోపాటు నిత్యావసర సరుకులు కూడా విపరీతంగా పెరిగి పోవడంతో విద్యుత్ బిల్లులు కట్టలేకపోతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

-లక్ష్మీదేవి, గృహిని, రాయచోటి.

వినియోగం తగ్గినా అదనంగా బిల్లు



ప్రస్తుతం చలికాలం వల్ల విద్యుత్ వినియోగం తగ్గినా కూడా అదనంగా బిల్లులు వస్తున్నాయి. ఇంకా వేసేవి కాలం వస్తే ఎంత బిల్ వస్తుందో నా హోటల్‌కు ఈ నెలలో రూ .4500 వ చ్చింది. వ్యాపారాలు కూడా సరిగా జరగడం లేదు. బాడుగలు, నిత్యావసరాలు పెరగడంతో బిల్లులు చెల్లించాలంటే ఇబ్బందిగా ఉంది.

- చంద్రశేఖర్,హోటల్ యజమాని, రాయచోటి.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి)

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పిఎన్ కాలనీలో నిర్వహించిన సదస్సులకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సదస్సులు జనవరి 8 వరకు ఉంటుందని చెప్పారు. గతంలో ప్రజలు భూ సమస్యలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నేడు గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. 45 రోజుల పాటు నిర్వ హించే సదస్సులకు ప్రజలు అర్జీ రూపంలో తమ సమస్యలు తెలియజేసి పరిష్కరిం చుకోవచ్చునన్నారు. ఇకనుంచి భూ సమస్యలపై బాధితులు ప్రభుత్వం చుట్టూ తిరగడం కాదు, ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించాలన్నదే ః సదస్సుల ముఖ్య ఉద్దేశ మన్నారు. ఇందులో ముఖ్యంగా ఫ్రీ హోల్డ్, మ్యుటేషన్, డికెటి, రీసర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై వినతులు స్వీకరించి బాధితులకు న్యాయం చేస్తారని చెప్పారు. బాధితులు తమ సమస్యలు అర్జీ రూపంలో తెలియజేసి రసీదు పొందాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. జిల్లాలోని రెవెన్యూ అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి భూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అధికారులు రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఇందులో ఏ ఒక్క అర్జీని కూడా మిస్ చేయకూడదన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి సమస్యలు పరిష్కరిస్తాం

చిన్నమండెం: మండలంలో పర్యటనకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెళుతున్న సందర్భంగా కొత్తపల్లి గ్రామ ప్రజలు మంత్రి కారును దారిలో ఆపి తమ గ్రామంలో సిమెంటు రోడ్లు, పెన్షన్లు, డ్రెయినేజీ కాలవలు, వీధిలైట్లు, ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి పత్రాలు సమర్పించారు. మంత్రి కొత్తపల్లి గ్రామ ప్రజల సమస్యలను ఓపికగా విని వారి సమస్యలన్నీ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్తపల్లి గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

మార్కెట్ కమిటీ నియామకాలకు గ్రీన్‌సిగ్నల్

- ఉమ్మడి జిల్లాలో 14 కమిటీలు ఏర్పాటు
- రిజర్వేషన్ ప్రాతిపదికన సభ్యుల ఎంపిక
- రెండేళ్లకు ఒకరు చొప్పన రొటేషన్
- మార్కెటింగ్ శాఖ మెమో జారీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వ్యవసాయ మార్కెట్ కమిటీల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మెమో మంగళవారం జారీ చేసింది. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, కమిటీ గౌరవాధ్యక్షులైన ఎమ్మెల్యేల సహకారంతో నిబంధనలకు అనుగుణంగా నియామకాలు చేపట్టాలని గైడ్‌లెన్స్ జారీ చేసింది. ప్రతి వ్యవసాయ మార్కెట్ కమిటికి 20 మంది చొప్పున పాలకమండలి సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంది. వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు. పాలక మండలిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళల కేటగిరీల ప్రకారం ఎంపిక ఉండాలని సూచించింది. ఉమ్మడి కడప జిల్లాలోని కడప, బద్వేల్, సిద్ధవటం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, సింహాద్రిపురం, కమలాపురం, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, కోడూరు, రాజంపేట, యర్రగుంట్ల, వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్న సంగతి తెలిసిందే. వీటికి రెండేళ్లకు ఒకరిని చొప్పున రొటేషన్ పద్ధతిన నియమించాలని ఆదేశాలు ఎంపిక చేసింది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు కలెక్టర్ జారీ చేయనున్న రోస్టర్ ఆధారంగా సంబంధిత కమిటీలకు గౌరవాధ్యక్షులైన ఎమ్మెల్యేల సలహాలు, సూచనలతో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఏదేమైనా రెండు వారాల్లోపు వ్యవసాయ మార్కెటింగ్ పాలకమండళ్లకు కొత్త నాయకత్వం అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లి



డైరెక్టర్లను సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎంపికైన నల్లబోతుల నాగరాజు, మండెం ప్రభాకర్‌లను వాల్మీకి మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తరాశి హరికృష్ణ, నల్లబోతుల సుదర్శన్ బాబు, సీనియర్ వాల్మీకి సంఘం నేతలు బొగ్గిటి కృష్ణమూర్తి, నాగినేని గోవింద్ ఘనంగా సన్మానించారు. మదనపల్లెకు విచ్చేసిన వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లను సాదరంగా ఆహ్వానించి జాతి అభ్యుదయానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన నల్లబోతుల నాగరాజు, మండెం ప్రభాకర్‌లను స్థానిక యూనియన్ క్లబ్‌లో వాల్మీకి మహాసేన నాయకులు దుశ్శాలువతో సన్మానించారు. యువతరం నేతలుగా రాష్ట్ర స్థాయికి ఎదిగిన డైరెక్టర్లు మరింత ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. వాల్మీకి జాతి బిడ్డలుగా జాతి జనుల గుండెల్లో సుస్థిర స్థానం ఆక్రమించాలని అభిలషించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 40 లక్షల మంది జనాభా కలిగిన వాల్మీకుల దశాబ్దాల ఎస్టీ సాధన నినాదాన్ని జాతి ప్రతినిధులుగా రాష్ట్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్పొరేషన్‌కు పెద్ద ఎత్తున నిధులు కేటాయించేందుకు పోరాడాలని, తద్వారా రాష్ట్రంలో వెనుకబడిన వాల్మీకి జాతిలోని పేదలకు విరివిగా సహాయం చేయడానికి వీలవుతుందన్నారు. ఇది వరకే రెండుమార్లు అసెంబ్లీ తీర్మానం చేసిన బిల్లును ఎస్టీ జాబితా చేర్పు కోసం కేంద్రానికి పంపిన విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు.

'మిట్స్' విద్యార్థులకు మార్కెటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి



మాట్లాడుతున్న ముఖ్య అతిథి కలతాగే

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (మిట్స్)లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎంబిఎ) విభాగం వారు సోషల్ మీడియా మార్కెటింగ్‌పై అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎయిర్ ఇండియా సౌదీ అరేబియా మాజీ స్టేషన్ మేనేజర్ ఎస్.బి.కలతాగే పాల్గొని మాట్లాడుతూ సమకాలీన మార్కెటింగ్‌లో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యత, విజయాన్ని సాధించడానికి వ్యాపారాలు వాటిని ఎలా ప్రభావితం చేయగలవు అనే దానిపై తన విస్తృతమైన అంతర్జాతీయ అనుభవం, సమర్థవంతమైన మార్కెటింగ్ వ్యూహాలపై విద్యార్థులకు అవగహన కల్పించారు. విద్యార్థులకు వారి నిర్వాహక మరియు వ్యవస్థాపక నైపుణ్యాలను మెరుగుపరచడానికి సోషల్ మీడియా మార్కెటింగ్ పద్ధతులు, పరిశ్రమ పోకడలు, వాస్తవ-ప్రపంచ అనువర్తనాలపై సమగ్ర అవగాహనను అందించడం లక్ష్యంగా ఈ గెస్ట్ లెక్చర్ సాగింది. సోషల్ మీడియా మార్కెటింగ్ అనేది ఒక ఉత్పత్తి లేదా సేవను ప్రచారం చేయడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మరియు వెబ్‌సైట్‌లను ఉపయోగించడం జరుగుతుందని, విద్యారంగంలో ఇ-మార్కెటింగ్ మరియు డిజిటల్ మార్కెటింగ్ అనే పదాలు ఇప్పటికీ ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ, అభ్యాసకులు, పరిశోధకుల కోసం సోషల్ మీడియా మార్కెటింగ్ మరింత ప్రజాదరణ పొందుతోందని పేర్కొన్నారు. ఫేస్‌బుక్, లింక్డ్‌ఇన్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, ఇతరులతో పాటు, అంతర్నిర్మిత డేటా అనలిటిక్స్ సాధనాలను కలిగి ఉన్నాయన్నారు. సోషల్ మీడియా మార్కెటింగ్ ప్రచారాల పురోగతి, కంపెనీలు ప్రస్తుత, సంభావ్య కస్టమర్‌లు, ప్రస్తుత మరియు సంభావ్య ఉద్యోగులు, పాత్రికేయులు, బ్లాగర్లు, సాధారణ ప్రజలతో సహా సోషల్ మీడియా మార్కెటింగ్ ద్వారా అనేక రకాల వాటాదారులను సైతం ప్రభావితము చేయగలవన్నారు. సోషల్ మీడియా మార్కెటింగ్‌ని ఉపయోగిస్తున్నప్పుడు, వ్యాపారులు తయారుచేసిన ప్రకటనల కాపీని ఉపయోగించకుండా, వినియోగదారులు సృష్టించిన కంటెంట్‌ను పోస్ట్ చేయడానికి సంస్థలు ఎక్కువగా మొగ్గు చూపుతాయని పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో విద్య యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్ యొక్క బోధన, అభ్యాసాన్ని పునర్నిర్వచించటానికి ఈ విశిష్ట కార్యక్రమంను నిర్వహించినట్లు, తమ బోధనా సామర్థ్యాలు మరియు విద్యార్థులలో పరిశోధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఇది ఒక మంచి అవకాశంగా తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ గీతా దేవి, కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగరాజన్ పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాణ్యమైన విద్యుత్ అందజేయాలి : ఎస్ఇ

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో వినియోగదాలందరికీ నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణ పేర్కొన్నారు. జిల్లా మంగళవారం రాయచోటి సర్కిల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో పాటు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇంజినీర్లు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. కొత్తగా ఏర్పడిన సర్కిల్‌లో ఉన్న సమస్యలపై అన్ని డివిజన్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని వినియోగదారులకు మెరుగైన సేవలు అందిచడం మన కర్తవ్యం అని తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని, రైతులకు ఎటువంటి సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిచడంలో ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం సర్కిల్ ఆఫీస్ కార్యాలాయనికి సంబంధించిన సర్దుబాట్ల గురించి రాయచోటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. యుగంధర్‌తో చర్చలు జరిపారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని, రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తున్న రైస్ మిల్లుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నాయకులతో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అంతటా రైస్ మిల్లుల్లో పోలీసులు దాడుల చేసి అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తించారని, గుర్తించిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ గోదాముకు తరలించిన జిల్లా పోలీసులకు అభినందనలు తెలియజేశారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి అక్రమ రవాణా చేస్తున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయ స్థానంలో శిక్షలు పడేలా చూడాలని కోరారు. గంజాయి సరఫరాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోపు కృష్ణప్ప, సాంబశివ, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి తిరుమల, దేవా, రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదులు సోషల్ ఇంజినీర్లు : జిల్లా జడ్జి

ప్రజాశక్తి - రాయచోటి



మాట్లాడుతున్న రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి

దేశానికి స్వాతంత్ర్యం రాకమునుపు కానీ, వచ్చిన తరువాత కానీ సామాజిక మార్పులలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తూ మెరుగైన సమాజం కోసం సోషల్ ఇంజినీర్లుగా పేరు తెచ్చుకున్నారని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి అన్నారు. భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య జిల్లాల కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్ నేతృత్వంలో మంగళవారం భోజన విరామ సమయంలో ఐఎఎల్ కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాదులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహానుభావులు బ్రిటిష్ వారిపై పోరాటం చేసి స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టారని చెప్పారు. వీరందరూ కూడా న్యాయవాదులేనని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌తో పాటు చాలా మంది న్యాయవాదులు రాజ్యాంగాన్ని అనుసరించి చట్టాలు చేశారన్నారు. న్యాయమూర్తులు ఉత్తమమైన తీర్పులు చెప్పడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తూనే వస్తున్నారనికొనియాడారు. సమాజంలో ఎలాంటి సందర్భాలలో వ్యక్తులు నేరాలకు పాల్పడుతున్నారు, అందుకు గల సామాజిక పరిస్థితులను సవివరంగా న్యాయమూర్తులకు వివరించి వారిని ఆలోచింపచేస్తున్నారని చెప్పారు. 1982లో జస్టిస్ కృష్ణయ్యర్ నేతృత్వంలో భారత న్యాయవాదుల సంఘం ఏర్పడి రాజ్యాంగ రక్షణ కోసం ప్రత్యేకంగా కృషి చేయడమే కాక దేశవ్యాప్త న్యాయవాదుల హక్కుల పరిరక్షణకు పాటుతోందని ఐఎఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్ అన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. రెడ్డయ్య, సహాయ కార్యదర్శి డి. నాగ ముని, ఎపిపి జగన్మోహన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ధనుంజయ్ కుమార్, ఆనంద్ కుమార్, రామాంజనేయులు, వీరభద్రయ్య, నాగమల్లు రెడ్డి, బాషా, టి.వి. రమణ, కిజర్ అలీ, ఆదిరెడ్డి నాయక్, కుష్టుమ, వరలక్ష్మి, ఉత్తేజ్ కుమార్, రవిశంకర్, పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కంటి ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం, ఇబ్బంది వచ్చినా చూపించుకోక పోవడంతో మధ్యలోనే చాలా మంది చూపును కోల్పోతున్నారని ప్రముఖ కంటి వైద్యులు అరవింద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీషిరిడి సాయి రెయిన్‌బో హైస్కూల్‌లో అరవింద్ నేత్రాలయం సహకారంతో కరస్పాండెంట్ గురజాల రెడ్డయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు కంటి సమస్యలు తలెత్తితే తొలినాళ్లనే గుర్తించినట్లయితే సమస్య పరిష్కారం మరింత సులభం అవుతుందన్నారు. కంటిచూపు సమస్య రాకుండా చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఎక్కువ ఫలితం ఉంటుందన్నారు. పిల్లలు ఎక్కువసేపు ఎలక్ట్రానిక్ స్క్రీన్‌పై చూస్తే వారు ఎక్కువ ఒత్తిడి, అలసటకు గురవుతరన్నారు. చాలామంది పిల్లలు ఆటలపై శ్రద్ధ చూపకుండా మొబైల్‌పై చూపుతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల కంటి చూపు బాగుండాలంటే పౌష్టిక ఆహారం అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అరవింద్ హాస్పిటల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రోడ్లు, నీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె రూరల్ మండలంలోని కోళ్ళబైలు కాలనీలో సుదీర్ఘకాలంగా నెలకొన్న సిసి రోడ్లు, మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప కోరారు. కాలనీ వాసులతో కలిసి మంగళవారం ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి మున్సిపాలిటీకి కూతవేటు దూరంలో ఉన్న కోళ్ళబైలు కాలనీని అభివృద్ధి చేయడంలో నాయకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పేదలు నివసించే ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంలోను, సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు ఏమైతున్నాయోఅధికారులు చెప్పాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే రోడ్లు వేసి వివక్ష చూపుతున్నారన్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి సిసి రోడ్లు వేయాలని, మంచినీటి సమస్య పరిష్కరించి, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో నేషనల్ హైవేపై కాలనీ వాసులతో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ బాలకల జూనియర్ కళాశాల విద్యార్థినులకు ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి సూచించారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన సంకల్ప ప్రోగ్రాంలో భాగంగా 620 విద్యార్థినులకు క్వశ్చన్ బ్యాంకు మెటీరియల్ సరఫరా చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేషనల్ విద్యార్థినిలకు, జనరల్ నిద్యార్థినిలకు కేర్ టేకర్స్ ద్వారా ప్రతి రోజు క్వశ్చన్స్ ఇచ్చి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థుల ప్రగతిని అధ్యాపకులు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.



ప్రశ్న పత్రాలతో విద్యార్థులు


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

నాణ్యమైన భోజనాన్ని అందించాలి : డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-సుండుపల్లి

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీలో జిల్లా ఉన్నత పాఠశాల, జికె.రాచపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా బోధన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. రానున్న పదవ తరగతి పరీక్షలు దృష్ట్యా విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా పాఠ్యాంశాలను భోధించాలని సూచించారు. వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పైన బాధ్యతగా పనిచేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకునే బాధ్యత ఉపాధ్యాయుల మీదనే ఉందని అన్నారు. అనంతరం ఉపాధ్యాయుల రిజిస్టర్, మధ్యాహ్నం భోజన పథకం రికార్డులు కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన తప్పక పాటించాలని లేని పక్షంలో అటువంటి ఉపాధ్యాయుల చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రవినాయక్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

టిడిపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని చలిమామిడి పంచాయతీలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నియోజకవర్గంస్థాయి టిడిపి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కొండ్రెడ్డి మాట్లాడుతూ కొత్త ఏడాది జనవరి-2025లో నియోజవర్గంలో కొన్నిమార్పులు జరుగునున్నాయని, పార్టీల శ్రేణులను సమాయత్తం చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అవలంభించిన అరాచక విధానాలతో టిడిపి కార్యకర్తలు విసిగిపోయారని అన్నారు. ప్రజలకు అన్నివిధాలా మేలు జరుగు తుందని అనుకుంటే గత వైసిపి నాయకులు ప్రస్తుతం టిడిపిలో ఉండటంతో అసలైన కార్యకర్తలకు న్యాయం జరగలేదన్నారు. త్వరలో నియోజవర్గంలో జరిగే పరిణామాలతో టిడిపి కుటుంబానికి మంచి రోజులు వస్తాయని అన్నారు. కార్యక్ర మంలో చెలిమామిడి ప్రసాద్‌రెడ్డి, సీనియర్ టిడిపి నాయకుడు షఫీ, మాజీ ఎంపిటిసి సిద్ధప్ప నాయుడు, టిడిపి నాయకులు రమణ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఉత్తుత్తి హామీలతో కూటమి ప్రభుత్వం దగా చేసిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలో పర్యటించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఇప్పటివరకు ఇచ్చిన హామీలను ఏమాత్రం పట్టించుకోక ప్రజలను దగా చేసిందన్నారు. హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కుక్క రాజు పల్లి, కుమ్మర పల్లెలో రాజేష్ కుమార్ రెడ్డి నూతనంగా నిర్మించిన గృహానికి వెళ్లి వారిని ఆశీర్వ దించారు. ఎద్దుల వారిపల్లెలో కరీముల్లా నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కోసు వారి పల్లెలో ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమా దంలో తీవ్రంగా గాయపడిన బావాజీ గృహానికి వెళ్లి ఆయనను పరామ ర్శించారు. తన సొంత ఖర్చులతో అతన్ని తిరుపతి ఆర్థోపెడిక్ ఆస్పత్రికి వైద్య చికిత్సల కోసం పంపించారు.

కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కలికిరి

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మండలంలోని మేడుకుర్తి పంచాయతీలోని వైసిపి కార్యకర్తలను పరామర్శించారు. మేడుకుర్తి పంచాయతీ రేగంటివారిపల్లికి చెందిన చిన్న మట్లి రెడ్డప్పరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకుని అతని ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మేడికుర్తి గ్రామంలోని వైసిపి నాయకుల ఇంటికి వెళ్లి వారిని వారి కుటుంబ సభ్యుల క్షేమ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. 2027లో మళ్లీ వైసిపి అధి కారంలోకి వస్తుందని అంతవరకు మనం ప్రజలకు మద్దతుగా ఉంటూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ ఉందామని వారికి సూచించారు. కార్యక్రమంలో గుట్ట పాలెం సర్పంచ్ వెంకటరెడ్డి, వైసిపి నాయకులు రత్నశేఖర్ రెడ్డి, కాటా బాబు, ఎస్‌టిడి హరి, వైసిపి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లు పంపిణీ

ప్రజాశక్తి-గాలివీడు

పారిశుధ్య కార్మికులకు ఎంత సేవ చేసినా కూడా ప్రజలందరూ రుణస్థులమేనని టివిఎస్ షోరూం అధినేత ఎస్.కె నిజాముద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం జడ్‌పిటిసి గృహం వద్ద పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌ను అమీన్ మెడికల్ స్టోర్ సహకారంతో పంపిణీ చేశారు. అంబేద్కర్ జయంతి రోజున కూడా పారిశుధ్య కార్మికులు చీరలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రఫీక్, విశ్వనాథరెడ్డి, కిరణ్‌కుమార్, ఫైజుల్, సలీమ్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు

ప్రేమాలయంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటికి చెందిన లయన్ సుంకర రామాంజనేయులు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి నాగజ్యోతి ఆర్థిక సాయంతో మండలం లోని బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు జిఎంటి కో-ఆర్డినేటర్ లయన్ పి.ఎస్.హరినాథ్ రెడ్డి తెలిపారు. అనంతరం దాత నాగజ్యోతి మాట్లాడుతూ తన భర్త .రామాంజనేయులు లయన్స్ క్లబ్‌లో పని చేసిన రోజుల్లో పలు రకాల సేవలు చేశారని అదే విధంగా ఆయన జ్ఞాపకార్థంగా ప్రథమ వర్ధంతి సందర్భంగా మా వంతుగా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ లయన్ వి.హరీష్ చంద్ర, దాత కుమారులు లయన్ గౌతమ్, లయన్ జ్ఞానతేజ, కోడలు జ్యోష్ణ మనవరాలు ఈషా పాల్గొన్నారు.

విఆర్‌ఎల సహాయ నిరాకరణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న విఆర్‌ఎలు సహాయ నిరాకరణ చేపట్టారు. మంగళవారం వారు కార్యాలయంలో విధులకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటిస్తూ డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలో ఒక అటెండర్, ఒక వాచ్ మెన్ విధులు నిర్వహిస్తుంటారని, వారు చేయాల్సిన పనులను విఆర్‌ఎల చేత పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేట్ వ్యక్తులు వాచ్‌మెన్, అటెండర్లుగా పని చేస్తు న్నారని అన్నారు. వీరు విధులు నిర్వహించే సమయంలో విఆర్‌ఎలు కూడా వారితో పాటు ఉండాల్సి వస్తోం దన్నారు. ఈ క్రమంలో కార్యాలయంలో ఏదైనా సమస్య తలెత్తితే తాము నిందలు భరించాల్సి వస్తోందని వాపోయారు. కావున ఇకనుంచి తాము అటెండర్, వాచ్‌మెన్ పనులు చేయబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం అధ్యక్షులు రత్నయ్య విఆర్‌ఎలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విఆర్‌ఎలు

పంటల బీమా నమోదు చేసుకోవాలి : డిఎఒ

ప్రజాశక్తి-చిన్నమండెం

రబీలో పంటలు సాగు చేసిన రైతులందరూ పంటల బీమాను తప్పని సరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలో కేసాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో డిపిఎం ప్రవీణ్, ఎంఎఒ బి.గీతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అందరూ పంట బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. టమోటా, మామిడి, వేరుశనగ పంటలకు ఈనెల 15 లోపు, వరికి 31వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. టమోటాకు ఎకరానికి రూ.1600, మామిడికి ఎకరానికి రూ.2250, వేరుశనగకు రూ.96, వరికి రూ.196లు చొప్పున చెల్లించాలని తెలిపారు. ముఖ్యంగా రబీ సీజన్‌లో సాగు చేసినటువంటి పంటలను రైతులు తప్ప నిసరిగా పంట నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల కో-ఆర్డినేటర్ చందురెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పావని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **రామాపురం :** రబీ సీజన్‌లో సాగుచేసిన రైతులు పంటలు బీమా చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచా లకులు జయరాణి తెలిపారు. మండలంలోని గువ్వలచెరువు, కసిరెడ్డి గారిపల్లి గ్రామా పంచాయితీ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్ర మాన్ని నిర్వహించారు. రవి సీజన్లో సాగు చేసే వరి, వేరుశనగ, టమోటా పంటలు సాగు చేసిన రైతులు రైతు సేవ కేంద్రంలో ధ్రువీకరణ పత్రాలు తీసుకొని పంటల బీమా కోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మామిడిలో యాజమాన్య పద్ధతులు చేసు కోవాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగవేణి రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రామపురం : మామిడి సాగు చేసే రైతులు బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎపి రైతు సంఘం నాయకులు వంగిమల రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి సచివాలయంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మామిడి రైతులకు ఈ అవకాశాన్ని కల్పించాయని తెలిపారు. ఎకరానికి రూ.2,250 ప్రీమియంతో రూ.45వేలు బీమా పొందవచ్చని అన్నారు. ఈనెల 15 లోపు రైతు సేవా కేంద్రం నుంచి పంట సాగు ధ్రువీకనపత్రం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు మీసేవ కేంద్రంలో పొందు పరుచుకోవాలన్నారు తెలిపారు. ఈనెల15 నుంచి 31 మే 2025 వరకు ఈ బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. మండలంలోని రైతాంగం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. **పీలేరు:** రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోడానికే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టిందని పీలేరు వ్యవసాయ శాఖ సహాయ విస్తరణాధికారి వైవి.రమణరావు, కెవికె శాస్త్రవేత్త సోమశేఖర్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన శాఖ, శాస్త్రవేత్తల బృందం మండలంలోని గూడరేవుపల్లి పంచాయతీ, మర్రిమాకులపల్లి తండాలో పర్యటించింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం క్రింద అన్నమయ్య జిల్లాలో మామిడి పంటల బీమా నమోదు ప్రక్రియ జరుగుతోందని అన్నారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం వలన కలిగే ఆర్థిక నష్టాల నుండి 2024-25 రబీలో రైతులను ఆదుకునే ప్రక్రియ చేపట్టిందని అన్నారు. ఈ బీమా సౌకర్యాన్ని పొందడానికి రైతులు తమ దగ్గరలోని బ్యాంకు, కామన్ సర్వీస్ సెంటర్ (మీసేవ), బీమా కంపెనీలు నియమించిన మధ్యవర్తులు, లేదా రైతులే నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారా పిఎంఎఫ్‌బివై పోర్టల్ లోనూ బీమా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి సుకుమార్ రెడ్డి, ఎఒ రమాదేవి, పాల్గొన్నారు.



పీలేరు : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి : ఆర్‌డిఒ


నిమ్మనపల్లె :ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిపిఒ బాలకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక అధికారి డిపిఒ బాలకృష్ణారెడ్డి, తహశీల్దార్ ధనుంజయులు తెలిపారు. మంగళవారం ముష్టూరు రెవెన్యూ క్లస్టర్ పరిధిలోని కొండ య్యగారిపల్లి, ముష్టూరు గ్రామానికి సంబంధించి తహశీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముఖ్యఅతిథిగా డిపిఒ, స్థానిక సర్పంచ్ చంద్రాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు వివిధ రకాల భూ సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నాదన్నారు. స్థానిక ప్రజలు పాల్గొని వారి సమస్యలపై తగిన ధృవపత్రాలను జోడించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తును ఆన్ లైన్ చేసి రశీదును అందించడం జరుగుతుందన్నారు. ముష్టూరు రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలపై 45 అర్జీలు అందాయని, వాటిని నిర్దేశించిన కాలపరిమితిలోగా పరిష్కరించడానికి కృషి చేస్తామ న్నారు. కార్యక్ర మంలో ఆర్‌ఐ అనంతలక్ష్మి, మండల సర్వేయర్ గోపీనాథ్, అటవీశాఖ అధికారి శోభారాణి, పంచాయతీ కార్య దర్శి లోకేశ్వరి, విఆర్‌ఓలు, **పీలేరు:** రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పీలేరు మండలం, తలపులలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆర్‌డిఒ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా క్షేత్రస్థాయిలోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి విన్నపాలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో రైతుల నుంచి 129 అర్జీలు వచ్చాయని, వాటిలో 109 రెవెన్యూ సమస్యలపై, 20 అర్జీలు ఇతర సమస్యలపై వచ్చినట్లు తహశీల్దారు భీమేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి భరత్ కుమార్ రెడ్డి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రమ, వీఆర్వోలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు. గ్రామ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **కలకడ :** రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఫణికుమార్ తెలిపారు. సర్పంచ్ శాంతం ఆధ్వర్యంలో మండలం లోని ముడియం వారి పల్లి పంచాయతీ పరిధిలో ఉన్న రైతుల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులకు 27 సమస్యలతో కూడిన దరఖాస్తులు వచ్చినవని తెలిపారు. పంచాయతీలో నీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **గాలివీడు:** అరవీడు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 99 దరఖాస్తుల అందినట్లు తహశీల్దార్ జె.భాగ్యలత పేర్కొన్నారు. రెవెన్యూ సంబంధించి 64 రేషన్ కార్డులకు, 9 పించన్లకు, 18 హౌసింగ్‌కు 8 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ ఆఫీస్ డిఎస్‌ఒ రఘురాం, విఆర్‌ఒ భార్గవ్, ఆర్‌ఐ బాలాజీ, మందపాటి రవీంద్ర బాబు, మాజీ వైస్ ఎంపిపి రమేష్‌కుమార్ రెడ్డి, పలు వురు పాల్గొ న్నారు. **వీరబల్లి :** మండలంలోని వంగిమళ్ళ గ్రామంలో తహశీల్దార్ ఆధ్వ ర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. నాగిరెడ్డిపల్లి, దుగ్గనపల్లి, టెంకా య చెట్లపల్లి, రామన్నవారిపల్లి, వనంకాడపల్లి, కావిలిగడ్డ మాలపల్లి, మాదిగ పల్లి, గ్రామాల ప్రజలు ఈ సదస్సులో పాల్గొన్నారు. భూముల కంప్యూట రీకరణ, సర్వే, ముటేషన్, తదితర సమస్యల పైన రైతులు అందించిన ఆర్జీలు త్వరత గతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో మొత్తం 26 వినతి పత్రాలు వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుస్మిత, సర్పంచ్ సరస్వతమ్మ, హౌసింగ్ ఎఇ వెంకటేష్, ఎలక్ట్రికల్ ఎఇ కిషోర్, ఎఫ్ఎస్‌ఒ రజిని, ఎఫ్‌బిఒ మహబూబ్ బాషా, విఆర్‌ఒ నరసింహులు, దేవదయ శాఖ కొండయ్య, సబ్ ఇంజనీర్ కేశవ, మాజీ ఎంపిటిసి జయచంద్ర రెడ్డి, గ్రామ ప్రజలు సచివాల సిబ్బంది పాల్గొన్నారు. **రామసముద్రం :** రైతులకు ఉన్న భూ సమస్యలను పరిష్కరిం చడానికి రెవెన్యూ సదస్సులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని, తహశీల్దార్ నిర్మాలదేవి అన్నారు. మండలంలోని చొక్కాండ్లపల్లి రెవెన్యూలో మీ భూమి-మీహక్కు అనే నినాదంతో రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. 45 రోజుల్లో రైతు సమస్య పరిష్కా రమవుతుందని పేర్కొ న్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్దిరెడ్డి, సిసి వెంకటరమణ, రమణ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్, అటవీ శాఖ, పోలీసు అధికారులు పాల్గొన్నారు. **నందలూరు :** నాగిరె డ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధి షాదీఖానాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 70 వినతులు వచ్చినట్లు తహశీల్దార్ అమర్నాథ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ముజీబ్‌బాషా, టిడిపి నాయకులు తాటి సుబ్బరాయుడు గౌస్ బేగ్, పోతురాజు మస్తానయ్య, హిమగిరినాథ్‌యాదవ్, సిహెచ్ఒ వెంకటనారాయణ, ఆర్‌ఐ జ్యోతి, మండల సర్వేయర్ ప్రభాకర్, రెవెన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పీలేరు : ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు


ప్రజా సేవలో 'ముక్కా' కుటుంబం

ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా విస్తృత సేవలు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

ప్రజాసేవే పరమావధిగా భావించి నిరంతర సేవా కార్యక్ర మాలతో ముక్కా రూపానందరెడ్డి కుటుంబం ప్రజలకు చేరువైందని టిడిపి యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి పేర్కొన్నారు. కష్టంలో ఉన్న వారిని ఆదుకోవడం, తలుపు తట్టి సాయం అడిగిన వారికి వెన్నుదన్నుగా నిలవడమే తమ ధ్యేయమని అన్నారు. తమకు ఉన్న సేవాగుణమే రైల్వేకోడూరు నియోజకవర్గంలో రాజకీ యంగా అందల మెక్కించిందని తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ముక్కారూపానందరెడ్డి పారిశ్రామికవేత్తగా కొందరికే తెలిసినా సేవా తత్పరుడిగా అందరికీ సుపరి చితుడని అన్నారు. ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆయన ఎంద రో అభాగ్యులను ఆదుకున్నారని, నియోజకవర్గంలో ఏ గడపలో కష్టం వచ్చినా మేమున్నామంటూ అండగా నిలబడుతుందని అన్నారు. ఆ కలుపు గోలుతనం, సేవాగుణమే రాజకీయంగా నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా నిలిపిందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ముందు ముక్కారూపానందరెడ్డి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారని తెలి పారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన ఆయన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గాన్ని చంద్రబాబుకు కానుకగా ఇస్తానని మాట ఇచ్చి, ఇచ్చిన మాట ప్రకారం కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపించి మాట నిలుపుకున్నారని అన్నారు. ముక్కా కుటుం బం వెంట నిలిచిన సాధారణ యువకుడు అరవ శ్రీధర్‌ను జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో నిలపడంలో రూపానందరెడ్డి కృషి వల్లేనని అన్నారు. శ్రీధర్ విజయానికి ముక్కా సతీమణి వరలక్ష్మితో పాటు ఇంటిల్లిపాది చెమ టోడ్చి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి బలమైన ప్రత్యర్థి ఉన్న కొరముట్ల శ్రీనివాసులు పై విజయం సాధించడంలో అనితర కృషి చేశారన్నారు. సాధారణంగా ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకునే నాయకులు అరుదుగా ఉంటారని, కానీ ముక్కా వారి కుటుంబం ఎందుకు పూర్తి భిన్నమని తెలిపారు. రూపానందరెడ్డి తన విశ్వాస పాత్రుడు ఆరవ శ్రీధర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిం చుకోనడంతోపాటు ప్రభుత్వ విప్ పదవి వచ్చేందుకు కృషి చేశారు. ఎన్నికల్లో తమకు అండగా నిలబడిన ప్రతి సామాన్యుడు నుంచి, పేరు పేరునా ప్రతి ఒక వ్యక్తిని గుర్తించి నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలబడుతున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి గుమ్మానికి చేరవే యడంలో ముక్కాకుటుంబం చూపుతున్న చొరవ నియోజకవర్గ ప్రజల గుండెల్లో ఆ కుటుంబానికి చెరగని ముద్ర వేసిందన్నారు. రూపానందరెడ్డి సతీమణి, ఆయన తనయుడు నిరంతరం ప్రజలలోనే ఉంటూ సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్న తీరు అభినందనీయమని టిడిపి నాయకులు, ముక్కా అభిమానులు పేర్కొన్నారు. ప్రజలలో వారికున్న ముక్కా కుటుంబానికి ఉన్న ఆదరణ చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపానంద రెడ్డికి అనుడా చైర్మన్ పదవి ఇచ్చి సత్కరించారన్నారు. బుధవారం కడప నగరంలోని ఆదిత్య కల్యాణమంటపంలో అనుడా చైర్మన్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. సేవా మార్గాన్ని నమ్ముకుని ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్న ముక్కా వారి కుటుంబం పదవులు, అధికారం కన్నా సేవే తమకు సంతృప్తినిస్తుందని ముక్కా సాయివి కాస్‌రెడ్డి తెలిపారు


ముక్కా రూపానందరెడ్డి


బాధితులకు నగదును అందిస్తున్న ముక్కా వరలక్ష్మి, ముక్కా సాయివికాస్‌రెడ్డి (ఫైల్ ఫోటో)


మాట్లాడుతున్న డిఇ సురేష్‌కుమార్

14 నుంచి సాగునీటి సంఘాలకు ఎన్నికలు : డిఇ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని ఈనెల 14 నుంచి జరిగే నీటి సంఘాల ఎన్నికలను విజయవంతం చేయాలని నీటి నీటిపారుదల శాఖ డిఇ సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని పింఛా ప్రాజెక్టు, ఊటిచెరువు, కొత్తచెరువు, కృష్ణారెడ్డి చెరువులకు జరిగే నీటి సంఘాల ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ ప్రాంతంలోని రైతులు ఓట్లను సక్రమంగా వినియోగించుకునే చూసుకో వాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. అనంతరం ఎంపిడిఒ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారని తెలిపారు. అక్కడ సంబంధించిన ఆయకట్టు దారులు నీటిసంఘాలలో ఓట్లు వేసే విధంగా అధికారులు చూడాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి మహబూబ్‌బాషా, ఎంఇఒలు రవీంద్ర నాయక్, వెంకటేశ్వర నాయక్, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ ప్రసాద్, ఇఒపిఆర్‌డి సురేష్‌బాబు, ఎంఇఒలు పాల్గొన్నారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

గాలివీడు : స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో బుధవారం ఉదయం 11 గంటలకు నీటి సంఘాల ఎన్నికపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఇరిగేషన్ జెఇ కల్యాణ్ కుమార్‌రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారిగా తహశీల్దార్, ఎంపిడిఒ, ఇరిగేషన్ జెఇ, అదనపు ఎన్నికల అధికా రులు కూడా శిక్షణ సమావేశానికి హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-గాలివీడు

సచివాలయాలలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి సమయపాలన పాటిస్తూ సకాలంలో కార్యాలయంలో విధుల్లో పాల్గొనాలని ఎంపిడిఒ సిఎ.జవహర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం గరుగుపల్లి, పేరంపల్లి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు రైతులకు ఉపయోగపడే విధంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. మామిడి మొక్కల ప్లాంటేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిఒ హరిప్రసాద్, ఇసి బాలాజీ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యాలయాల మాటున భూ దోపిడీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యా సంస్థల మాటున భూ దోపిడి చేస్తూ చెరువులను, చెరువు తొట్టెలను పూర్తిగా స్వాహ చేస్తూ కోట్లకు పడగలెత్తిన అన్నమాచార్య విద్యా సంస్థలపై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేయనున్నట్లు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు పోలి శివకుమార్ తెలిపారు. మంగళవారం రాజంపేటలోని పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ బోయినపల్లిలో విద్యా సంస్థల పేరుతో భారీగా భూదోపిడి జరుగుతుందని, ఇందులో సర్వే నెంబర్ 1080లోని చెరువు తొట్టిలను కూడా కబ్జా చేసి భవనాలు నిర్మించడమే కాకుండా రోడ్లను కూడా ఏర్పాటు చేసుకుని దర్జాగా విద్యాసంస్థలు నడుపుకుంటున్నారన్నారు. ఇప్పటికే ఈ అంశాలపై పూర్తి ఆధారాలతో కలెక్టర్‌కు, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు లేవని, పైగా ఫిర్యాదు చేసినందుకు తిరిగి ఫిర్యాదు చేసిన వారిపై అధికారులు కేసులు నమోదు చేయడం చూస్తుంటే ఈ వ్యవహారంపై అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. అన్నమాచార్య విద్యా సంస్థల మాటున జరుగుతున్న భూదోపిడిలపై ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకుపోతున్నామని తెలిపారు. విద్యా సంస్థల మాటున మాయమైన చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములకు విముక్తి లభిస్తుందన్నారు. బహిరంగంగానే చెరువులను ఆక్రమించి భవనాలు, ప్రహరీలు నిర్మించినా అధికారులు పట్టించుకోవడంలేదని చెప్పారు. గత ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని అనేక విధాలుగా భూ దోపిడీ చేశారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అలాంటి భూ దోపిడీలకు అడ్డుకట్ట వేయాలని అన్నమాచార్య విద్యా సంస్థల పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ భూములు, చెరువులను గుర్తించేలా ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. లేదంటే తామే ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రికి టిఎన్ఎస్ఎఫ్ తరఫున అతి త్వరలోనే అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో బాలాజీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్


గంజాయి నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గంజాయి విక్రయిస్తున్న 18 మంది అరెస్టు

- రూ.1.30 లక్షల విలువైన గంజాయి సీజ్
- డిఎస్‌పి కొండయ్య నాయుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గంజాయిని విక్రయిస్తున్న 18 మందిని అరెస్టు చేసినట్లు మదనపల్లి డిఎస్‌పి కొండయ్య నాయుడు తెలిపారు. ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు గంజాయి వద్దు బ్రో కార్యక్రమంలో భాగంగా మదనపల్లి పోలీసు సబ్ డివిజన్ పరిధిలో గత రెండు రోజులుగా దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో గంజాయి తరలించి, విక్రయాలకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిలో పలువురు మైనర్లు, విద్యార్థులు ఉండగా తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి, మొదటి తప్పుగా క్షమించి మైనర్లను వదిలిపెట్టినట్లు తెలిపారు. గంజాయి తరలించి విక్రయాలకు పాల్పడుతున్న 18 మందిపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. కురబలకోట మండలం, అంగళ్లు సమీపంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. మదనపల్లె రూరల్ సర్కిల్ సిఐ రమేష్, ఎస్‌ఐలు దిలీప్ కుమార్, వెంకటశివ, హరిహర ప్రసాద్, గాయత్రీ, రహీముల్లా, శివ సిబ్బందితో వెళ్లి దాడులు జరిపి గంజాయి స్మగ్లర్ల వద్ద సుమారు 4.5 కిలోలు రూ.1.30 లక్షలు విలువచేసే గంజాయిని సీజ్ చేశామని డిఎస్‌పి తెలిపారు. పట్టుబడిన వారిలో నరసింహులు, రెడ్డెమ్మ, చిన్నయ్య, కార్తీక్ పవన్, బాలకృష్ణ, లక్ష్మయ్య, వెంకటరమణ, రమణమ్మ, జైబున్నిసా, సైఫుల్లా, నరసింహులు, మహమ్మద్, భరత్, నవీన్ కుమార్, ముజీబ్ ఖాన్, ప్రశాంత్ కుమార్ రెడ్డి, సూరజ్ బాషాలు ఉన్నట్లు తెలిపారు. గంజాయి క్రయ విక్రయాలు, ఉత్పత్తి తీవ్ర నేరం కిందకు వస్తాయని అన్నారు. వినియోగించేవారు కూడా నేరస్థులేనని తెలి పారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు గంజాయి బారిన పడి భవిష్యత్తు నాశ నం చేసుకొవద్దని సూచించారు. ప్రజలు సైతం గంజాయి రహిత సమాజం కోసం పోలీసులతో కలిసి నడవాలని పేర్కొన్నారు. అందరూ బాధ్యతగా వ్యవ హరిస్తే మదనపల్లె డివిజన్‌లో గంజాయిని కూకటి వేళ్లతో పెకిలిస్తామని చెప్పా రు. గంజాయిని సరఫరా చేసే ప్రధాన స్మగ్లర్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.